


ఇందిరమ్మ ఇళ్లు మంజూరెప్పుడో?

- దరఖాస్తు స్వీకరించి ఎనిమిది మాసాలు
- జిల్లాలో 1,85,404 దరఖాస్తుల రాక
- మొదటి విడతలో జిల్లాకు 10,500 ఇళ్ల కేటాయింపు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

సొంతింటి కల నెరవేర్చుకునేందుకు బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూముల ఇళ్లు కట్టించి ఇస్తామని ఊరించినప్పటికీ, జిల్లాలో కనీసం వెయ్యి మంది లబ్ధిదారులకు కూడా ఇళ్లు కట్టించలేదు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమల్లోకి తీసుకవస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. వాటిల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒకటి. ఈ పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి సొంత స్థలం ఎస్సీ, ఎస్టీలకు 6 లక్షలు, ఇతరులకు 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తామని ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టింది. ప్రభుత్వ పాలన పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిసెంబరు 9న ఆరు గ్యారంటీ పథకాల్లోని రెండు పథకాలను ప్రారంభించారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించగా, 5 లక్షల వరకు ఉన్న ఉచిత ఆరోగ్యశ్రీ పథకాన్ని 10 లక్షల రూపాయలకు పెంచారు. ఆ తర్వాత మార్చి నెలలో గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించగా, రూ.500కే సబ్సిడీ వంట గ్యాస్‌ను అందజేస్తున్నారు. ప్రజాపాలనలో భాగంగా డిసెంబరు 6 నుంచి జనవరి 6వ తేదీ వరకు డివిజన్, వార్డు, గ్రామ సభలను నిర్వహించి ఐదు గ్యారంటీ పథకాలకు సంబంధించి ఒకటే దరఖాస్తును స్వీకరించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా 2,40,667 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం 1,85,404 మంది దరఖాస్తు చేసుకున్నారు.



● నియోజకవర్గానికి 3,500 ఇళ్లు

మార్చిలో ప్రభుత్వం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇళ్లు కేటాయించింది. అందులో భాగంగా పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు 10,500 ఇళ్లు మంజూరయ్యాయి. ఈ ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం ఇంకా ప్రారంభించలేదు. మార్చిలో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ రాగా. జూన్ 6వ తేదీ వరకు పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నది. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధిదారుల ఎంపిక కోసం ఇప్పటి వరకు మార్గదర్శకాలను విడుదల చేయకపోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది. లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యత ఎమ్మెల్యేలకే అప్పగించే అవకాశాలున్నాయి. చాలామంది బడుగు, బలహీనవర్గాలకు చెందిన ప్రజలు ఇళ్ల మంజూరు కోసం ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. ఏయే వర్గాలకు ఎన్ని ఇళ్లు మంజూరు చేయాలి, తదితర అంశాలకు సంబంధించిన మార్గదర్శకాలను ఇంకా ప్రభుత్వం రూపొందించ లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పుడు ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి రూపొందించిన మార్గదర్శకాలనే అమల్లోకి తీసుకరావచ్చని తెలుస్తున్నది. అయితే ప్రభుత్వం ప్రస్తుతం రైతు రుణమాఫీ పథకాన్ని కొనసాగిస్తున్నది. ఇందిరమ్మఇళ్లు ఎప్పుడు మంజూరు కోసం ప్రభుత్వం ఎప్పుడు మార్గదర్శకాలు విడుదల చేస్తుందా, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఎప్పుడు ప్రారంభిస్తారా అని ఎదురుచూస్తున్నారు. ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించాలని బడుగు బలహీన వర్గాల ప్రజలు కోరుతున్నారు.

కన్నాల ఆలయ అర్చకుడికి ప్రతినెల వేతనం చెల్లిస్తాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి



అర్చకుడి ఆర్థిక సహాయం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమ-సురేష్‌రెడ్డి

మంథని, ఆగస్టు 24: తమ స్వగ్రామమైన మండలంలోని కన్నాల శ్రీభూనీలా-శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులకు ఇకనుంచి తమ కుటుంబ సభ్యుల సహకారంతో ప్రతినెల వేతనాన్ని అందచేస్తామని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆమె కుటుంబ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి శనివారం ఆలయాన్ని సందర్శించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులకు ఖర్చుల నిమిత్తం రూ.9వేల విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడు తూ తన కుటుంబ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నేత స్వర్గీయ ముస్కుల నారా యణరెడ్డి కుమారుడు శ్రావణ్‌రెడ్డి సహకారంతో అర్చకులకు ప్రతినెల రూ.9వేల వేతంగా అందజేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్లు వికే. రవి, గుండా విజయలక్ష్మి-పాపారావు, కొట్టె పద్మ-రమే ష్, కుర్రు లింగయ్య, వేముల లక్ష్మి-సమ్మయ్యలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- ఖని ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశంలో కలెక్టర్, ఎమ్మెల్యే



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 24: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వైద్యులకు సూచించారు. శనివారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆసుపత్రిలో రోగులకు మౌలిక వసతులు కల్పించాలని, లాజిస్టిక్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రోగులకు వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, పారిశుధ్యాన్ని మెరుగుపర్చకపోతే కాంట్రాక్ట్‌ను కూడా రద్దు చేయాలని సూచించారు. పారిశుధ్య కార్మికులతో నిర్వహణ పకడ్బందీగా అమలుచేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో కిందిస్థాయి సిబ్బంది ప్రవర్తించే తీరును నిరంతరం పర్యవేక్షించాలని, రోగులతో, వారి సహాయకులతో సిబ్బంది ఓపికతో ఉండే విధంగా చూడాలన్నారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాల పని తీరును ప్రతివారం సమీక్షించాలని సూచించారు. ఆసుపత్రిలో ఆర్ఎంఓలకు ప్రత్యేక విధులు కేటాయించాలని, సింగరేణి మెడికల్ వైద్య కళాశాలలో ర్యాగింగ్ జరుగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. మెడికల్ కళాశాల అనుసంధానంగా నిర్మిస్తున్న 355పడకల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని వచ్చే ఏడాది జూలై నాటికి పనులు పూర్తయ్యే విధంగా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యం ఇంకా మెరుగుపడాలని, కొంత మంది రోగుల పట్ల, వారి బంధువుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, వారిని ఉపేక్షించేది లేదన్నారు. రామగుండాన్ని మెడికల్ హబ్‌గా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు, త్వరలోనే మరిన్ని వైద్య సేవలు, డిపార్ట్‌మెంట్లు అందుబాటులోకి తీసుకురానున్నట్టు, క్యాథ్ ల్యాబ్‌ను, డయోగ్నిస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను కోరినట్టు, వైద్యంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని, ఇక్కడి నుంచి ఏ కేసులు కూడా రెఫర్‌కు వెళ్లవద్దంటూ వైద్యులకు సూచించారు. ఎవరైనా వైద్య సిబ్బంది, వైద్యులు రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. మెడికల్ కళాశాల, ఆసుపత్రి నిర్వహణపై ప్రిన్సిపాల్ హిమబిందు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మాణం అవుతున్న ఆసుపత్రి భవన నిర్మాణాన్ని, ఆపరేషన్ థియేటర్ రెనోవేషన్, లేబర్ రూం విస్తరణ, పేమెంట్‌రూమ్‌ల విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అరుణ శ్రీ, మేయర్ బంగి అనీల్ కుమార్, సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



మండల విద్యా వనరుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

పాలకుర్తి, అగస్టు 24: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. మండలంలోని బసంత్‌నగర్ తెలుగు మీడియం హై స్కూల్‌లో నూతనంగా నిర్మించిన మండల విద్యా వనరుల కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే ఈసాలతక్కళ్లపల్లిలో నిర్మించిన పాఠశాల అదనపు గదులను ప్రారంభించారు. అనంతరం పుట్నూర్‌లోని కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించి సీసీరోడ్డు, ప్రహరీ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజయ్య, ఎంపీడీవో పొల్సాని శశికళ, ఎంపీవో సుదర్శన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, కేశోరాం పర్మినెంటు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేణి శ్రీనివాస్, నాయకులు పాత రవిందర్, వాసు, తోట ప్రశాంత్, మాదాసు శ్రావణ్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలి : కలెక్టర్



సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 24: జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టర్ శనివారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, రోడ్లు భవనాల శాఖ, టీఎస్ఎంఐడీసీ తదితర శాఖల కింద చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ శాఖల ద్వారా మంజూరు చేసిన అభివృద్ధి పనులు వాటి ప్రస్తుత స్థితిగతులు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలన్నారు. గ్రామాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేసి వాటికి సంబంధించిన బిల్లులు పూర్తి స్థాయిలో చెల్లించేలా చూడాలని సూచించారు. నియోజకవర్గం అభివృద్ధి నిధులు, ప్రత్యేక అభివృద్ధి నిధులు డీఎంఎఫ్‌టీ కింద చేపట్టిన రోడ్లు, డ్రైన్లు భవనాలు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉన్న 10 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం వెతుకుతూ మరమ్మతు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో చేపట్టిన ఆసుపత్రి నిర్మాణ పనులు సకాలంలో పూర్తి కావాలని కలెక్టర్ సూచించారు. అలాగే జిల్లాలోని మున్సిపాలిటీల్లో టీయూఎఫ్ఐడీసీ కింద చేపట్టిన అభివృద్ధి పనులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి గంప రవీందర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, ఈఈ పంచాయతీరాజ్ గిరిష్‌బాబు, ఈఈ ఆర్‌బీ భావ్‌సింగ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భావోద్వేగాలను నియంత్రించుకుంటే ఉన్నతమైన జీవితం

- జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి డాక్టర్ టి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి శ్రీనివాసరావు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 24: భావోద్వేగాలను నియంత్రించుకుంటేనే ఉన్నతమైన జీవితం ఉంటుందని జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి డాక్టర్ టి.శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. రామగుండం మండల లీగల్‌సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం గోదావరిఖని గౌతమినగర్‌లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాటాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి న్యాయశాస్త్రంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు మంచి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని అప్పుడే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని సాధన చేసేందుకు ప్రయత్నిస్తారన్నారు. పుస్తకాలు చదవాలని, ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సామాజిక కార్యకర్త మిట్టపల్లి శంకర్, రామగుండం లీగల్ అథారటీ ప్యానెల్ అడ్వకేట్స్ జి. భూమయ్య, ఎండి షహనవాజ్, కళాశాల ప్రిన్సిపల్ మీర్జా సిరాజ్‌బేగ్, కోర్టు సిబ్బంది. కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు ఆటంకం లేకుండా రోడ్ల నిర్మాణం

- ఎమ్మెల్యే విజయరమణారావు



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, ఆగస్టు 24: గ్రామాలలో వ్యవసాయ పంట పొలాలకు వెళ్లడానికి రైతులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా మట్టి రోడ్ల నిర్మాణం పూర్తి చేయనున్నట్లు ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని పిట్టలఎల్లయ్యపల్లిలో శనివారం గుండ్లపల్లి వరకు పంటల మీదుగా రూ.10లక్షల నిధులతో నిర్మించనున్న గ్రావెల్ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వానాకాలం నాటికి గుండ్లపల్లి వరకు మట్టి రోడ్డు పూర్తిచేయనున్నట్లు తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పిట్టల రవికుమార్, చొప్పరి రాజయ్య, భైరగోని రవీందర్‌గౌడ్, గుండేటి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని కనగర్తికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత చిన్ని ఇమామ్ ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. వెంట ఎండీ రఫీక్, గసిరెడ్డి మహేందర్ రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్, జాగిరి కిశోర్, కోడం శ్రీనివాస్, పరిపాటి రమణారెడ్డి ఉన్నారు.

ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి గణేష్



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జడ్జి గణేష్

సుల్తానాబాద్, ఆగస్టు 24: ప్రతీ ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సుల్తానాబాద్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ అన్నారు. కోర్టులో ఏర్పాటు చేసిన వైద్య ఆరోగ్య శిబిరాన్ని జడ్జి శనివారం ప్రారంభించి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు సిబ్బంది, పోలీస్ సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి జోగుల రమేష్, ఏజీపీ ఆవుల లక్ష్మీరాజం యాదవ్, హెల్త్ క్యాంప్ ఇన్‌చార్జి గజవెల్లి గణేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

జ్వరాల బారిన సీతంపేటవాసులు..

ముత్తారం, ఆగస్టు 24: మండలంలోని సీతంపేట గ్రామంలో గత 15 రోజుల నుంచి జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రతి ఇంటిలో ఇద్దరు లేదా ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామంలో పారిశుధ్య లోపం కారణంగానే జ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీల్లో 8 నెలల నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతోంది. స్పెషల్ ఆఫీసర్ గ్రామానికి 15 రోజులకు ఒకసారి, గ్రామ కార్యదర్శి వారానికి ఒకరోజు వస్తుండడంతో పర్యవేక్షణ లోపిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఎక్కడి చెత్త అక్కడనే పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, దోమల వల్లనే జ్వరాలు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎన్టీపీసీ అధికారుల సంఘం కార్యవర్గం

జ్యోతినగర్, ఆగస్టు 24 : రామగుండం ఎన్టీపీసీ అధికారుల సంఘం ఎన్ని కలు శనివారం జరిగాయి. సంఘం అధ్యక్షుడిగా మహేంద్ర కుమార్ ఘన విజయం సాధించారు. అలాగే ప్రధానకార్యదర్శిగా నితీష్ కుమార్, ఉపాధ్య క్షుడిగా మదన్ వైష్ణవ్, జాయింట్ సెక్రెటరీగా వి రాజేష్ విజయం సాధిం చారు. పీఆర్ సెక్రెటరీగా మణిదీప్ సింగ్ లంబ, కోశాధికారిగా శుభానంద్ తివారి, మరో ముగ్గురు ఎన్టీపీసీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సభ్యులుగా ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి
చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం, ఆగస్టు 24: శంకరపట్నం మండలం వంకాయగూడెం శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంకాయగూడెంకు చెందిన చల్ల కనకయ్య (58) శుక్రవారం తెల్లవారు జామున బహిర్భూమికి వెళ్లేందుకు ఇంట్లో నుంచి బయటకు వచ్చి రోడ్డుపైన వెళ్తున్నాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో రోడ్డుపై పడి ఉన్న కనకయ్యను చూసిన స్థానికులు మృతుడి భార్య మధనవ్వకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు కనకయ్యను చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కనకయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.



ఆధునిక కాలంలో
జంతుశాస్త్ర పురోగతి అవసరం


ప్రొఫెసర్ రాజశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్ రమేశ్

జమ్మికుంట, ఆగస్టు 24: ఆధునిక కాలంలో జంతుశాస్త్ర పురోగతి ఎంతో అవసరం ఉందని ఉస్మానియా విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జంతుశాస్త్రంలో ఇటీవలి పురోగతులు అనే అంశంపై ఒక రోజు సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ మట్లాడుతూ మానవ మనుగడపై విద్యార్థులు జంతుశాస్త్ర అభివృద్ధికి వినూత్నమైన పరిశోధనలు చేయాలని సూచించారు. మానవళి అభ్యున్నతి జంతుశాస్త్ర పురోగతితో ముడిపడి ఉందన్నారు. ఆధునిక కాలంలో రోజు రోజుకు పెరుగుతున్న క్యాన్సర్ వ్యాధి కారకాలు, వాటి నివారణ, తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రిన్సిపాల్ బి రమేశ్‌ప్రొఫెసర్ రాజశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేశ్, జంతుశాస్త్ర విభాగాధిపతి కె గణేశ్, కళాశాల అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కే రాజేంద్రం, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ ఓదేలు కుమార్, జంతుశాస్త్ర అధ్యాపకులు మమత, రమేశ్, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సైదాపూర్, ఆగస్టు 24: సైదాపూర్ మండలంలోని లస్మన్నపల్లి గ్రామ స్టేజీ వద్ద ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. పీడీఎస్ బియ్యం తరలిస్తున్న దిరావత్ పాండు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి, ట్రాలీని సీజ్ చేశామని తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.


















నృసింహుడిని దర్శించుకుంటున్న భక్తులు

నృసింహుడి సన్నిధిలో శ్రావణ భక్తుల రద్దీ

ధర్మపురి, ఆగస్టు 24: ధర్మపురి క్షేత్రంలో శ్రావణ భక్తుల రద్దీ నెలకొంది. లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు శ్రావణ మాసం మూడవ శనివారం భక్తులతో రద్దీగా అగుపించాయి. ఉద యం వేళలో ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితక వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పంచోపనిషత్తులతో అభిషేకం, మంత్రపుష్పాలు, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం, నరసింహ హోమం జరిపించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందిం చారు. ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, ఆగస్టు 24: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య పర్యవేక్షకులు హరిహర నాథ్, చంద్రశేఖర్, సునీల్ ఇతరఅధికారులు పర్యవేక్షించారు. ఆంజనేయస్వామిని జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి తదితరులు దర్శించుకున్నారు.


కొండగట్టులో పూజలు చేస్తున్న భక్తులు

అవినీతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వ పాలన

- కాంగ్రెస్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

ముస్తాబాద్, ఆగస్టు 24: అక్రమాలకు, అవినీతికి తావు లేకుండా రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చేలా పాలన కొనసాగిస్తోందన్నారు. గతంలో అవినీతి అక్రమాలతో ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టి అస్తవ్యస్తంగా పనులు చేయడంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయన్నారు.. గతంలో పనులు చేతకాక కేటీఆర్, హరీశ్‌రావు అవినీతి అక్రమాలకు పాల్పడ్డార న్నారు. ఇప్పుడు పనులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కుటుంబ పాలనతో ప్రజలను ఎన్నో ఇబ్బం దులకు గురిచేశారన్నారు. దీంతో ప్రజలే ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. ఓవైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాళేశ్వరం ప్రాజెక్టుకు వెళ్లడం ఒక డ్రామా అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి రెండు లక్షల రైతు రుణమాఫీ చేసి రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. రైతు రుణమాఫీపై బీఆర్‌ఎస్ నాయకులు మతి లేని మాటలు మాట్లాడడం ప్రజలు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న కటకం మృత్యుంజయం

చేస్తున్న పనులకు అడ్డం పడుతూ సమయాన్ని వృథా చేయడం బీఆర్‌ఎస్ మానుకోవాలన్నారు. ప్రతిపక్షంలో ఉండి ప్రజల సమస్యలను ప్రభుత్వానికి విన్నవించడం గౌరవప్రదమని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, నాయకులు తాళ్ల విజయ్ రెడ్డి, దీటి నర్సింలు, ముచ్చర్ల శ్రీనివాస్, తలారి నర్సింలు, భాను, గంత రాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


రాజన్న ఆలయంలోని వివిధ విభాగాల్లో అవకతవకలు

- రెండు రోజుల పాటు ఏసీబీ అధికారుల తనిఖీలు - ఉన్నతాధికారులకు నివేదిక సమర్పణ

వేములవాడ కల్చరల్, ఆగస్టు 24: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో పలు విభాగాల్లో అవకతవకలు బయటపడ్డాయి. రెం డు రోజులపాటు ఆలయంలోని పలు విభాగాల్లో క్షుణ్ణంగా పరిశీలించిన ఏసీబీ అధికారులు పలు అవకతవకలు గుర్తించి ఉన్నత స్థాయి అధికా రులకు శనివారం నివేదికను అందించారు. ఏసీబీ తెలంగాణ పేరుతో అధికారులు ఎక్స్‌లో అవకతవకలతో కూడిన పోస్టును విడుదల చేశారు. రాజన్న ఆలయంలోని లడ్డూల త యారీ విభాగంలోని స్టాక్ రిజిస్టర్‌లో తేడాలు ఉండటం గుర్తించారు. నెయ్యి, జీడిపప్పు, నూనే సంబంధిత వాటిలో తేడాలు బయటపడ్డాయి. తలనీలాలు సమర్పించడం కోసం వచ్చే భక్తుల నుంచి కల్యాణకట్ట వద్ద రూ. 50 నుంచి రూ. 100 వసూలు చేయడం, నూతన టెండర్లకు కమిషనర్, దేవాదాయ శాఖ ఆమోదం లేకుండానే పాత టెండర్ల ప్రకారం వస్తువులను కొనుగోలు చేయడం వంటి అవకతవకలు బయటపడ్డాయి.

● ఆలయ ఉద్యోగుల్లో ఆందోళన..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం, శుక్రవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. రెండు రోజులపాటు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో పలు విభాగాల్లోని ఫైళ్లను సీజ్ చేసి తీసుకువెళ్లారు. ఏసీబీ అధికారులు పలు విభాగాల్లో అవకతవకలు ఉన్నట్లు ఉన్నతాధికారులకు నివేదికను అందజేశారు. దీంతో సంబంధిత విభాగాల ఉద్యోగులు ఇరుక్కున్నామని భయాందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది.



ఏసీబీ తెలంగాణ పేజీలో వైరల్‌గా మారిన అవకతవకల పోస్ట్

సౌదీలో యువకుడి మృతి

- కరీంనగర్‌లో విషాదం


షహెదా ఖాన్(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24: కరీంనగర్ ఆదర్శనగర్‌కు చెందిన ఎండీ షహెదా ఖాన్(27) సౌదీ అరేబి యాలో నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు సమాచారం అందడంతో మృతుడి ఇంట విషాదం నెలకొంది. కరీంన గర్ ఆదర్శనగర్‌కు చెందిన ఎండీ షహెదాఖాన్ ఏడు సంవత్సరాల క్రితం ఉపాధి కోసం సౌదీ అరేబియాకు వెళ్లి అక్కడ ఒక సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఏడాదికి ఒకసారి స్వదేశానికి వచ్చి వెళ్లేవాడు. ఆదర్శనగర్‌కు చెందిన షహెదాఖాన్ తండ్రి స్వస్థలం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, తల్లిది కరీంనగర్. షహెదాఖాన్ కరీంనగర్‌కు చెందిన మహిళను వివాహం చేసుకుని ఇక్కడే ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్నాడు. వారికి రెండు సంవత్సరాలు, 8 నెలల ఇద్దరు పిల్లలున్నారు. ఏడాది కిందటే షహెదాఖాన్ కరీంనగర్‌కు వచ్చి కొన్నిరోజులు భార్యపిల్లలు, కుటుంబ సభ్యులతో గడిపి తిరిగి సౌదీ అరేబియాకు వెళ్లాడు. షహెదాఖాన్ మరణించాడని తెలిసిందని, కానీ సౌదీ అరేబియా నుంచి అధికారికంగా పూర్తి సమాచారం అందలేదని మృతుడి బంధువులు వెల్లడించారు. సౌదీఅరేబియాలో శుక్రవారం నుంచి మూడు రోజులు సెలవుదినాలు కావడంతో మృతదేహం పంచనామా, పోస్టుమార్టం పూర్తి అయి స్వదేశానికి చేరేందుకు వారం పది రోజులు పట్టే అవకాశముందని మృతుడి బంధువులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గొల్లపల్లి, ఆగస్టు 24: గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు చేసి శనివారం పట్టుకున్నారు. డీటీ శ్రీని వాస్, పౌరసరఫరాల శాఖ ఇన్స్‌పెక్టర్ స్వామి ఆధ్వర్యంలో పక్కా సమాచారం మేరకు గ్రామంలో పస్తం కనకయ్యకు చెం దిన షెడ్డులో అధికారులు సోదాలు చేయగా 11 క్వింటాళ్ల విలువైన 20 బస్తాల పీడీ ఎస్ రైస్ పట్టుబడింది. వాటిని స్వాధీనం చేసుకుని గోదాంకు తరలించారు. కనకయ్యను అదుపులోకి తీసుకుని, అతడి పై సెక్షన్ 6-ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వీణవంక: మండలంలోని ఘన్ముక్ల గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా రేషన్ బియ్యం ఆటోలో తరలిస్తుండుగా పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. సుల్తానాబాద్‌కు చెందిన బోనగిరి సురేష్ పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ బలవన్మరణం

గొల్లపల్లి, ఆగస్టు 24: మండలంలోని వెన్గుమట్ల గ్రామంలో శనివారం తీరని విషాధం నెలకొంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఓ ఆటోడ్రైవర్ రెండు నెలల క్రితం నెలల తక్కువతో జన్మించిన తన చిన్నారికి మెరుగైన వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక జీవితం మీద విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన పొన్నం వెంకటేష్ (28) అనే నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు గ్రామంలో ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. వెంకటేష్‌కు రెండేళ్ల క్రితం వివాహం జరగగా రెండు నెలల క్రితం ఓ ఆడ శిశువు జన్మించింది. చిన్నారి పుట్టిన నాటి నుంచి అనారోగ్యంతో బాధపడుతుండడతో ప్రైవేట్ అనుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఇప్పటికే చిన్నారి వైద్య ఖర్చుల కోసం బంధుమిత్రులు, తెలిసిన వాళ్ల దగ్గర అప్పులు చేసి సుమారు రూ. 4 లక్షల మేర వెచ్చించారు. అయినా చిన్నారి జబ్బు నయం కాకపోగా మరింత ముది రింది. దీనికి వైద్యులు చిన్నారి ప్రాణాపాయం నుంచి బయటపడాలంటే మెరుగైన వైద్యం చేయించాలని, అందుకు పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో వెంకటేష్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. బిడ్డకు మెరుగైన వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక జీవితం మీద విరక్తి చెంది శనివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు.

మహిళలకు లోన్‌యాప్ వేధింపులు

గంగాధర, ఆగస్టు 24: మండలంలో పలువురి మహిళలకు లోన్‌యాప్ సిబ్బంది ఫోన్ చేసి వేధింపులకు గురి చేస్తున్నారు. తాను లోన్‌తీసుకోకున్న ఆన్‌లైన్‌లో రుణం పొందిన వ్యక్తికి సాక్షి సంతకం చేయగా రుణం తిరిగి చెల్లంచక పోవడంతో సాక్షి సంతకం చేసిన వ్యక్తి మహిళ బంధువులతో పాటు ఆ గ్రామ మహిళా మాజీ సర్పంచ్ భర్తను లోన్‌యాప్ సిబ్బంది అసభ్య కరంగా మాట్లాడుతూ వేధింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ యువకుడు ఆన్‌లైన్‌లో లోన్‌యాప్‌లో రుణం తీసుకున్నాడు. రుణం తీసుకున్న స్నేహితుడికి గంగాధర మండలంలోని యువకుడు ఆన్‌లైన్‌లో సాక్షి సంతకంతో పాటు ఫోన్ నంబర్ జతచేశాడు. రుణం తీసుకున్న యువకుడు సకాలంలో చెల్లించలేదు. దీంతో సాక్షి సంతకం పెట్టిన మండలంలోని యువకుడి మొబైల్‌లోని కాంటాక్టు నంబర్లను సేకరించి మహిళలకు సంస్థ నుంచి పలుమార్లు ఫోన్ చేసి వేధింపులకు గురి చేశారు. సదరు వ్యక్తి తమకు తెలియదని సమాధానం చెప్పినా రుణం ఇచ్చిన వారు అసభ్యకరంగా మహిళ భర్తతో పాటు మరో పది మంది మహిళలతో మాట్లాడినట్లు తెలిపారు.

అదుపుతప్పి పొలంలో పడ్డ కారు

- మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు తప్పిన ప్రాణాపాయం

జగిత్యాలరూరల్, ఆగస్టు 24 : జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు వెళ్లే రహదారి లో శనివారం ఉదయం కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. శనివారం ఉదయం కారులో కరీంనగర్ నుంచి జగిత్యాల మీదుగా కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు కారులో ఐదుగురు ఉపాధ్యాయులు వస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రహదారి బురదమయమై పూర్తిగా దెబ్బతింది. ఈ క్రమంలో పాఠశాలకు వెళ్లే రహదారి మూల మలుపు వద్ద కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లడంతో కారు స్వల్పంగా దెబ్బతిన్నది. ఈసంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయులకు ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో ఉపాధ్యాయులు ఊపిరిపీల్చుకున్నారు. పొలంలో పడ్డకారును ఉపాధ్యాయులు, స్థానికులతో కలిసి బయటకు తీశారు.

పెద్దపల్లి లైబ్రరీకి పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందజేత


మాట్లాడుతున్న డాక్టర్ బీఎస్ రావు

పెద్దపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షల కోసం పోటీ పడే నిరుద్యోగ యువతీ యువకుల కోసం కావాల్సిన స్టడీ మెటీరియల్‌ను కరీంనగర్‌లోని బీఎస్ రావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీఎస్‌రావు లైబ్రరీకి అందజేశారు. శనివారం పెద్దపల్లి లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో స్కిల్స్ కొరత కారణంగా దేశంలో పదకొండు కోట్ల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు స్థాపిస్తే అభివృద్ధితో పాటు ఉపాధి కల్పన పెరుగుతుం దన్నారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ డాక్టర్ బీఎస్‌రావు ఎప్పటినుంచో పేదలకు ఉచిత వైద్య సేవలం దిస్తున్నారన్నారు. గత సంవత్సరం నుంచి విద్యాపరంగా నాలుగు జిల్లాల్లో పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకి ఇస్తున్నారు తెలిపారు. ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ఫణిందర్, అడ్వకేట్ ఆడెపు దినేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి పెరిగిన వరద

- కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీరు పెరుగుతున్నది. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 23,094 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 16,564 క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 6,530 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. నంది పంప్‌హౌస్ నుంచి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు పడడంతో వరద నీరు ఎక్కువగా వస్తున్నది. ప్రాజెక్టు నిండడంతో గేట్లు ఎత్తి గోదావరిలోకి వదులుతున్నారు. ఆ నీరంతా శ్రీపాద ఎల్లంపల్లికి చేరుతున్నది. మరింత వరద పెరిగితే మాత్రం నంది పంప్‌హౌస్‌లో మరో రెండు మోటార్లు ఆన్ చేసి 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలని భావిస్తున్నామని నీటి పారుదల శాఖాధికారులు పేర్కొన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.529 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతుంది. శనివారం రెండు పంపుల ద్వారా 6300 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 18.5 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

ఎల్ఎండీకి నీటి విడుదల ప్రారంభం

బోయినపల్లి, ఆగస్టు 24: మిడ్ మానేరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో ఎల్ఎంపీలోకి నీటి విడుదలను శనివారం ప్రారంభించారు. మిడ్ మానేరులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6300, ములవాగు మానేరు వాగు ద్వారా 700 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 313.99 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 18.33 టీఎంసీల మేరకు చేరుకొంది. కాగా ఎల్ఎండీ ప్రాజెక్టుకు రెండు వేల క్యూసెక్కుల నీటి విడుదలను ప్రాంభించారు.

శ్రీరాంసాగర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం ఇన్‌ఫ్లో పెరిగింది. ఎస్సారెస్పీలోకి 29,443 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 51.659 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అసరాలకు ప్రాజెక్టు నుంచి 3,822 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అంతరాలయ దర్శన టికెట్ల పునరుద్ధరణ


అంజన్న ఆలయం

మల్యాల, ఆగస్టు 24: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో కొన్నాళ్ల క్రితం కొవిడ్-19 నేపథ్యంలో నిలిచిపోయిన అంతరాలయ దర్శన టికెట్లను పునరుద్ధరిస్తున్నట్లు ఈవో రామకృష్ణారావు తెలిపారు. కొవిడ్‌కు ముందు రూ.400 టికెట్ అంతరాలయ దర్శనంలో భాగంగా సంప్రదాయ దుస్తులతో అయిదుగురికి దర్శనం కల్పించగా కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో 16 మార్చి 2020 నుంచి అంతరాలయ దర్శనాలు నిలిపివేశారు. శనివారం నుంచి మళ్లీ యదావిధిగా రూ.400టికెట్‌తో అంతరాలయ దర్శనాలు పునరుద్ధరించినట్లు భక్తులు సహకరించాలని ఈవో పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యాయత్నం

- ఉన్నత ఉద్యోగం సాధించినా రిలీవ్ చేయడం లేదని ఆవేదన - మండలపరిషత్ కార్యాలయంలోనే ఘటన


చికిత్సపొందుతున్న శ్రీనివాస్

ఇల్లంతకుంట, ఆగస్టు 24: ఉన్నతస్థాయి ఉద్యోగం సాధించినా మండలపరిషత్ అధికారులు రిలీవ్ చేయడం లేదంటూ రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కిష్టరావుపల్లె గ్రామపంచాయతీ కార్యదర్శి లంబాడి శ్రీనివాస్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. తోటి పంచాయతీ కార్యదర్శుల వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా హవేలీఘన్‌పూర్ మండలం పర్దీన్‌పూర్ గ్రామానికి శ్రీనివాస్ నారాయణఖేడ్ మండలం అంత్వార్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేశాడు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన 317 జీవోతో ఇల్లంతకుంట మండలం కిష్టరావుపల్లె గ్రామపంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యాడు. ఇల్లంతకుంటలో తోటి పంచాయతీ కార్యదర్శులతో ఉంటూ శ్రీనివాస్ పోటీపరీక్షలకు సిద్ధం అవుతూనే విధులు నిర్వహించే వాడు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో మెదక్ మున్సిపాలిటీలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. ఈనెల 31లోపు విధుల్లో చేరవలసి ఉంది. తనను పంచాయతీ కార్యదర్శి నుంచి రిలీవ్ చేయాలని అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. అయినా ఆలస్యం జరుగుతుండటంతో శనివారం మండలపరిషత్ కార్యాలయానికి చేరుకొని ఎంపీడీవోకు సమస్యను విన్నవించాడు. వెంటనే పక్కన ఉన్న గదిలోకి వెళ్లి వెంటతెచ్చుకున్న క్రిమిసంహారక మందుతాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఇల్లంతకుంటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రథమ చికిత్స జరిపి ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. తొమ్మిది ఉద్యోగాలు సాధించాడని గతంలో ఇదే మండలపరిషత్ కార్యాలయంలో సన్మానం పొందిన శ్రీనివాస్‌ను అపస్మారకస్థితిలో తరలించడాన్ని మండలపరిషత్ సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. సంఘటనపై ఎంపీడీవో శశికళను వివరణ కోరగా రెండు రోజుల క్రితమే తమకు లేఖ అందిందని, ఎంపీవో నుంచి ఎన్‌వోసీ తెచ్చుకోవాలని సూచించానని తెలిపారు. తొందరపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, తాము ఎక్కడా ఆలస్యం చేయలేదని వివరించారు.

- అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 24: విధుల్లో పట్ల అంకితభావంతో పని చేస్తున్న ఉద్యోగికి మరో ఉద్యోగం రావడంతో రిలీవ్ చేయడంలో మానసికంగా వేధింపులకు పాల్పడిన ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు డిమాండ్ చేశారు. అధికారుల తీరుతో మనస్తాపానికి గురై ఇల్లంతకుంట మండల పరిషత్తు కార్యాలయంలో పురుగుల మందు తాగిన కిష్టరావుపల్లి పంచాయతీ కార్యదర్శి లంబాడి శ్రీనివాస్‌ను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శనివారం వారు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శిగా పనులు చేస్తూనే ఉన్నత ఉద్యోగం సాధించిన శ్రీనివాస్‌ను మండల పరిషత్ అధికారులు విధుల నుంచి రిలీవ్ చేయకపోవడం వల్లే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు వేధింపులకు గురిచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన కుటుంబంలో జన్మించిన శ్రీనివాస్ ఎన్నో కష్టాలను అధిగమించి ఉన్నత ఉద్యోగం సాధిస్తే రిలీవ్ చేయాల్సిన అధికారులు ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమని బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేశ్‌నాయక్ అన్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు తిరుపతినాయక్ తదితరులు ఉన్నారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

ధర్మపురి, 24 :ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామంలో సట్టంశెట్టి రజని (39) అనే వివాహిత శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆమె దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోరుట్ల రూరల్, ఆగస్టు 24 : మండలంలోని వివిధ గ్రామాల నుంచి కో రుట్ల పట్టణానికి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నట్లు తహసీల్దార్ కిషన్ శనివారం తెలిపారు. మండలం లోని వివిధ గ్రామాలలో రెవెన్యూ అధికారులతో దురుసుగా ప్రవర్తించిన వారిపై కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఆర్ఐ రాజేందర్‌రావు ఇచ్చిన పిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రెండు రోజుల నుంచి అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న 22 ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 15 మందికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, ఆగస్టు 24: మద్యం సేవించి వాహనాలు నడపుతూ ఇటీవల కరీంనగర్‌లో పట్టుబడిన 15మంది వాహనదారులకు కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 70మందిని ట్రాఫిక్ పోలీసులు శనివారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఇందులో ఐదుగురికి 7 రోజులు, 10 మందికి 3 రోజులు జైలు శిక్ష, మొత్తం 34 వేల జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారని సీఐ తెలిపారు. మిగతా 55మందికి 90 వేల 500 రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు 223 వాహనదారులకు జైలు శిక్షలు పడ్డాయని సీఐ తెలిపారు.

రాజన్న సేవలో బీసీ కమిషన్ సభ్యుడు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 24: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు కిషోర్‌గౌడ్ శనివారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొని కోడెమొక్కు చెల్లించుకున్నారు. సూపరింటెండెంట్ తిరుపతిరావు, పీఆర్వో అశోక్ ప్రసాదం అందజేశారు.


స్వాగతం పలుకుతున్న సూపరింటెండెంట్ తిరుపతిరావు

గుర్తుతెలియని వృద్ధురాలు మృతి


కరీంనగర్ క్రైం, ఆగస్టు 24: కరీంనగర్ కోర్టు సమీపంలోని వాటర్‌ట్యాంక్ పక్కన గుర్తుతెలియని వృద్ధురాలు(65) మృతిచెందిందని రెండో టౌన్ పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి 9గంటల సమయంలో వృద్ధు రాలు పడిపోయి ఉండగా గుర్తించిన పోలీసులు ఆమెను అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చ్యూరీ గదికి తరలించి భద్రపరిచినట్లు తెలిపారు. వృద్ధురాలిని గుర్తించి నవారు రెండో టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి, ఆగస్టు 24: మండలంలోని మండెపల్లి కేసీఆర్ నగర్‌కు చెందిన బోయిని సదానందం (45)పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం ఇంటి బయట పురుగుల మందు తాగగా గుర్తించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించినట్లు స్థానికులు తెలిపారు. సదా నందం సిరిసిల్ల మార్కెట్‌లో రైతుల వద్ద కూరగాయలు కొనుగోలు చేసి విక్రయించేవాడు. పది రోజులుగా మార్కెట్‌కు సైతం వెళ్లడం లేదని బంధువులు చెప్ప న్నారు. ప్రస్తుతం సదానందం పరిస్థితి విషమంగా ఉంది.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- సెస్ రిటైర్డ్ లైన్‌మెన్ మృతి


ధర్మారంలో బైకును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

కోనరావుపేట ఆగస్టు 24: మండలంలోని ధర్మారం గ్రామ శివారులో బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టగా సెస్ రిటైర్డ్ లైన్‌మెన్ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సంజీవ్‌నగర్‌కు చెందిన ఆర్ వెంకట్రాజం (63) అనే వ్యక్తి గతంలో లైన్‌మెన్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. ప్రస్తుతం కోనరావుపేట మండల మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళుతుండగా ధర్మారం గ్రామ శివారులో ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో కింద పడిపోయిన వెంకట్రాజముకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఆసుపత్రి తరలించారు. అనుపత్రిలో శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కోనరావుపేట ఎస్సై రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ రాద్ధాంతం

మంథని, ఆగస్టు 24: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీపై బీఆర్ఎస్ పార్టీ రాద్ధాంతం చేయడం సరికాదని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్‌జీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని సాంకేతిక కారణాలతో కొంత మందికి మాత్రమే రుణమాఫీ కాలేదని, ఈవిషయాన్ని అధికారుల దృష్టికి రైతులు తీసుకువస్తే వారికి కూడా రుణ మాఫీ జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. బీఆర్ఎస్ తప్పుడు ఆరోపనలు చేస్తూ ఆందోళనకు దిగడం సరికాదన్నారు.

సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

మంథని, ఆగస్టు 24: మండలంలోని వివిధ గ్రామాలు, మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరుచేసిన సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కులను మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వెళ్లి శనివారం అందజేసినట్లు మంత్రి పీఏ ఆకుల చంద్రశేఖర్ తెలిపారు. 109 మంది లబ్ధిదారులకు రూ.35లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులు, రూ.39లక్షల కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

మంథని, ఆగస్టు 24: పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలను ప్రభుత్వం విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. శనివారం జరిగిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వకపోడం శోచనీయన్నారు. ఉద్యోగులకు ప్రతినెల 1న జీతాలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి హామీ అమలునోచుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బూడిద గణేష్, రవి, చందు, రాజయ్య, శ్రావణ్, శంకర్‌లు పాల్గొన్నారు.

హజ్ యాత్రికుడికి సన్మానం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 24: మక్కాకు పాదయాత్రగా బయలుదేరిన భద్రాద్రి జిల్లా ఇల్లందు పట్టణానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ ఆబిద్‌కు పెద్దపల్లి ముస్లింలు కలెక్టరేట్ వద్ద ఘనస్వాగతం పలికారు. అనంతరం సమీపంలో గల మసీదులో కాంగ్రెస్ మైనార్టీ నాయకులు సయ్యద్ మస్రత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మైనార్టీ నాయకులు మౌలానా నాయకుల్లా, ఇస్తగాముద్దీన్, సర్దార్ ఖాన్, తబ్రేజ్ ఖాన్, మహ్మద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఖనిలో భారీ వర్షం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 24: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి, శనివారం భారీవర్షం కురిసింది. శుక్రవారం ఉరుములు,పిడుగులతో సుమారు రెండు గంటల పాటు 2సెంటీమీటర్ల వర్షం కురిసింది. శనివారం కూడా ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

వీటీసీలో సైబర్ క్రైమ్‌పై అవగాహన

కోల్‌సిటీ, ఆగస్టు 24: గోదావరిఖని సింగరేణి వీటీసీలో సైబర్ క్రైమ్, మహిళలపై నేరాల గురించి, గంజాయి, డ్రగ్స్ గురించి అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నపేటలో వైద్యశిబిరం

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 24 : మండలంలోని అప్పన్నపేట గ్రామపంచాయతీలో శనివారం అయూష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సాగర్, పంచాయతీ కార్యదర్శి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

ముత్తారం, ఆగస్టు 24: మండలంలోని మైదంబండ గ్రామానికి చెందిన బూడిద లత అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు బాధిత కుటుంబ సభ్యులు తెలుపగా, ఆయన స్పందించి ఎల్‌వోసీ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1,50,000 మంజూరు చేయించారు. శనివారం బాధిత కుటుంబానికి హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో అందచేశారు.

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



ఖని కృష్ణవేణి స్కూల్‌లో విద్యార్థుల వేషధారణలు



జీడీనగర్ యూనివర్సల్ పాఠశాలలో..



యైటింక్లయిన్‌కాలనీ శాంతినికేతన్ హైస్కూల్‌లో..

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 24: గోదావరిఖని కృష్ణవేణి విద్యాసంస్థల్లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుని, గోపికల వేషధారణలతో చేసిన సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.



సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో..

యైటింక్లయిన్‌కాలనీ : శ్రీకృష్ణాష్టమి వేడుకలను స్థానిక స్పేస్ శాంతినికేతన్ హైస్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పాపిరెడ్డి, ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పాలకుర్తి : మండలం పరిధిలోని జీడీనగర్ ప్రాంతంలోని యూనివర్సల్ ఐ.ఐ.టి ఫౌండేసన్ హైస్కూల్‌లో శనివారం ఘనంగా ముందస్తు కృష్ణ అష్టమి వేడుకలను జరిపారు. కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

మంథని : స్థానిక కాకతీయ హైస్కూల్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి, డైరెక్టర్ కిరణ్ రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామగిరి : మండలంలోని సెంటినరీకాలనీ(కల్వచర్ల) ప్రగతి పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి, ఇంచార్జ్ రాము, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎలిగేడు : సుల్తాన్‌పూర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం సంతోషరెడ్డి, హైస్కూల్ ప్రధానోపాధ్యయులు నరేంద్రచారి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు స్రవంతి, శ్రీలత, వెంకటేశ్వర్లు, సంధ్య, కుమారస్వామి, రమా, బాలకృష్ణ, మూర్తి, పద్మ, భారతి, అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణంలోని పలు ప్రైవేట్ విద్యా సంస్థల్లో కృష్ణాష్టమి ముందస్తు వేడుకలను శనివారం జరుపుకున్నారు. ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణ ప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వివేకానంద హైస్కూల్లో డైరెక్టర్ భూసారపు సుజాత రవీందర్, హెచ్‌ఎం మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండల కేంద్రంలోని వేద వ్యాస ఉన్నత పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జూపాక ఉమామహేశ్వర్, జూపాక దేవమణి, డైరెక్టర్ గుర్రం దివాకర్, ప్రిన్సిపాల్ కోట సదయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కాల్వశ్రీరాంపూర్ వేద వ్యాస ఉన్నత పాఠశాలలో..

జూలపల్లి : మండల కేంద్రంలోని న్యూ బ్రిలియంట్ ప్రైవేటు ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కొండ సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని కాసులపల్లి ట్రినిటి పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అడప బాపురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మంథని కాకతీయ హైస్కూల్‌లో..



రామగిరి ప్రగతి పాఠశాలలో..



సుల్తాన్‌పూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..

విద్యుదాఘాతంతో ఆవు మృతి

పాలకుర్తి, ఆగస్టు 24: మండలంలోని బామ్లానాయక్ తండాలో శనివారం విద్యుదాఘాతానికి గురై ఆవు మృతిచెందింది. బదావత్ తిరుపతికి చెందిన ఆవు 25 కేవి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్‌కు గురై మృత్యువాతపడింది. ఆవు ఖరీదు 30వేల రూపాయల వరకు ఉంటుందని యజమాని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రైతు రుణమాఫీపై స్పష్టత ఇవ్వని మంత్రులు

- మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 24: రుణమాఫీపై మంత్రులు స్పష్టత ఇవ్వడం లేదని, ఎన్నికలకు ముందు ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి తీరా గెలిచిన తర్వాత లేనిపోని షరతులతో రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2లక్షల రూపాయల రుణం మాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కారణాలు వెతుకుతోందన్నారు. రుణమాఫీపై కాంగ్రెస్ మంత్రులకు సరైన అవగాహన లేదని, మంత్రులందరు భిన్న ప్రకటనలు, పొంతనలేని సమాధానాలు చెబుతూ అటు రైతాంగాన్ని, ఇటు ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారన్నారు. ఇన్‌కం ట్యాక్స్, తెల్లరేన్ కార్డు తదితర కారణాలు చెప్పి రైతులను అనర్హులుగా పేర్కొనడం సిగ్గుచేటన్నారు. వ్యవసాయశాఖ మంత్రి దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు కొనసాగిస్తారా.. లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా, పట్టించుకునే దిక్కు లేకుండాపోయిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారని, సర్వేచేసి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతు రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాన్ని నిరసిస్తూ ఆందోళనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్నం అంజయ్య, ఠాకూర్ రాంసింగ్, శిలివేరు ఓదెలు, పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, వెల్లంపల్లి శ్రీనివాసరావు, జంగ చక్రధర్‌రెడ్డి, ఎల్లంకి ప్రకాష్, మంథెన క్రిష్ణా, ఎండి ఫహీం, పెండ్యాల కుమార్, కాసనగొట్టు విజయ్ తదితరులు పాల్గొన్నారు

పనులు త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్



మార్కండేయ కాలనీలో రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

కోల్‌సిటీ, ఆగస్టు 24: రామగుండం కార్పొరేషన్ పరిధిలో మంజూరు చేసిన మురుగు కాలువల నిర్మాణ పనులను అత్యంత ప్రాధాన్యతగా భావించి త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని రోడ్లు, మురుగుకాలువలను పరిశీలించారు. మార్కండేయ కాలనీ ప్రధాన నాలా, వెజిటేబుల్ మార్కెట్ వద్ద మంజూరుచేసిన నాలాకు సంబంధించి మురుగు కాలువ నిర్మాణాలకు టెండర్ల ప్రక్రియ పూర్తయినందు వల్ల ఏజెన్సీలు త్వరగా పనులు ప్రారంభించి నిర్దేశించిన గడువులోపు పూర్తిచేసేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు ప్రాధాన్యత క్రమంలో గ్రౌండ్ చేయాలని, వాటిని సకాలంలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ అరుణశ్రీ, కమిషనర్ శ్రీకాంత్, ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్, అధి కారులు ఉన్నారు.

28 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

ఎలిగేడు, ఆగస్టు 24: మండలంలోని సుల్తాన్‌పూర్‌లో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు ఆగస్టు 28, 29 తేదీల్లో రిపోర్ట్ చేయాలని మండల విద్యాశాఖ అధికారి కవిత తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్ఐ) మండలస్థాయి క్రీడా పోటీల ఎంపిక ప్రక్రియ మొదలవుతుందన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రీడల్లో జిల్లాస్థాయి ఎంపిక అండర్ 14లో పాల్గొనే విద్యార్థులు 1-1-2011తర్వాత జన్మించి, 6వ తరగతి ఆపై చదువుచున్నవారు. అండర్ 17లో పాల్గొనే విద్యార్థులు 1-1-2008తర్వాత జన్మించి 6వ తరగతి ఆపై చదువుతున్న వారు పాల్గొనాలని సూచించారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఎలిగేడు, ఆగస్టు 24: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి కేంద్రం సెంటర్ అడ్మినిస్ట్రేటర్ దారవేణి స్వప్న అన్నారు. మండల కేంద్రంలోని ఎస్‌హెచ్‌జి మండల సమాఖ్యలో శనివారం వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జెండర్ ఈక్వాలిటీ, సైబర్‌క్రైమ్, గృహహింస, వరకట్న వేధింపులు, పనిచేసే చోట వేధింపుల గురించి వివరించడం జరిగింది. అలాగే సఖీ సెంటర్ అందించే ఐదు రకాల సేవల గురించి, హెల్ప్‌లైన్ నంబర్లు 100, 181, 1098, 112, 1930, 14567 వివరించారు. మహిళా హక్కులు చట్టాలపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సఖీ కేంద్రం పారామెడికల్ స్టాఫ్ స్వప్న, ఏపీఎం సుధాకర్, సీఏలు జ్యోతి, మల్లేశం, ఆనంద్, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

29న ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 24: జిల్లాలోని నిరుద్యోగ యువకులకు హైదరాబాద్‌లోని ఫ్లిప్ కార్ట్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 29న ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లిప్ కార్ట్ కంపెనీ హైదరాబాద్‌లో 25 డెలివరీ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. పదవ తరగతి పై చదువులు చదివిన వారు అర్హులని, వీరి వయస్సు 20నుంచి 40ఏళ్ల లోపు ఉండాలని, మగవారికి మాత్రమే అర్హత ఉంటుందని తెలిపారు. ఈ కంపెనీలో చేరిన వారికి వేతనం నెలకు 15వేల రూపాయలు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు 29న ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్‌లతో ఐటీఐ కేంద్రానికి వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 నంబర్లకు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు తెలిపారు.

మరుగుదొడ్లు నిర్మించాలని వినతి

ముత్తారం, ఆగస్టు 24: మండల కేంద్రంలోని కాసర్ల గడ్డ బస్టాండ్ వద్ద మరుగుదొడ్లు నిర్మించాలని శనివారం పలువురు గ్రామస్థులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బస్టాండ్ వెనకాల గల ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జా చేసుకుని ఇల్లు నిర్మించుకున్నారని గ్రామస్థులు ఆరోపించారు. గతంలో ప్రభుత్వం ప్రజల అవసరాల మేరకు బావిని తవ్వించిందని, దాన్ని కొంతమంది పూడ్చివేసి ఇల్లు నిర్మించుకున్నారన్నారు. దీంతో అక్కడ ఖాళీ స్థలం లేకపోవడంతో ఇక్కడ మరుగుదొడ్లు నిర్మాణం చేయలేకపోయారన్నారు. మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా కాసర్ల గడ్డ బస్టాండులో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వినతిపత్రం అందించిన వారిలో గ్రామస్థులు పేయ్యల కుమార్, పింగిలి దేవేందర్ రెడ్డి, అలగం రాజేశం, చింతిరెడ్డి బాబురెడ్డి, ఆలువోజ్ రవీందర్, అమ్ము శ్రీనివాస్, నూనెటి కృష్ణ, పింగిలీ సంజీవరెడ్డి, గుడి రాజేశం, గుడి రవి, తోట భూమన్న, జక్కుల రాజయ్య, ఎర్ర రవీందర్, రామిండ్ల శ్రీశైలం, ఇందారపు లక్ష్మి, రేగుంట గంగయ్య, గద్దె సమ్మయ్య ఉన్నారు.

ఐఎఫ్‌టీయూ మహాసభలను విజయవంతం చేయండి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 24: మహారాష్ట్రలోని పూణేలో జరిగే భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఫ్టీయూ)జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంస్థ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మిక వర్గ హక్కుల సాధనకు, భవిష్యత్ పోరాట రూపకల్పనకు సెప్టెంబరు 1, 2 తేదీల్లో మహారాష్ట్ర లోని పూణే నగరంలో జాతీయ మహాసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాద్, రాష్ట్ర నాయకులు తూటిచెర్ల రత్నకుమార్, హమాలీసంఘం నాయకులు సంతోష్, గట్టయ్య, పోషమల్లు, సాంబయ్య, కరీంపాషా పాల్గొన్నారు.

క్రీడల్లో వెన్నంపల్లి విద్యార్థుల ప్రతిభ

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 24: మండల స్థాయి క్రీడా పోటీల్లో వెన్నంపల్లి విద్యార్థులు సత్తా చాటారు. అండర్-17 విభాగంలో కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఖోఖోలో మొదటి స్థానం, కబడ్డీలో బాలికల అండర్-14 తొలి స్థానంలో, అండర్-17 బాలికలు 2వ స్థానంలో, అండర్-14 బాలురు కబడ్డీలో రెండో స్థానం, అండర్-14 బాలుర ఖోఖో 2వ స్థానం సాధించారు.

అథ్లెటిక్స్‌లో అండర్-14 బాలికల 100మీటర్ల పరుగు పందెంలో ఏ సాజిత మొదటి స్థానం, కే ప్రణవి రెండో స్థానం, అండర్-17 బాలికల 100 మీటర్లలో కే రక్షిత, బాలురలో కే చరణ్ మొదటి స్థానంలో నిలిచారు. షాట్‌పుట్ అండర్-14 బాలికలలో జీ గంగాభవానీ తొలి స్థానం, సీహెచ్ వైష్ణవి రెండో స్థానం, అండర్-17 బాలికల విభాగంలో డీ సల్మా తొలి స్థానంలో నిలిచారు. లాంగ్ జంప్‌లో అండర్-14 బాలికలు ఏ సాజిత, అండర్-17లో కే రక్షిత రెండో స్థానంలో నిలిచారు. ఎస్‌జీఎఫ్ మండల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్‌ఎం రాజేశ్వర్ దయాల్, ఏపీసీ సభ్యులు, పీఈటీ దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్



అధ్యాపకురాలు శారదను సన్మానిస్తున్న లెక్చరర్లు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 24: గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు గిర్నాల శారదకు ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ భౌతిక శాస్త్ర విభాగ ఆచార్యులు డాక్టర్ డి.శ్రీనివాస్ పర్యవేక్షణలో చేసిన పరిశోధన ఎఫెక్ట్ ఆఫ్ రేర్ ఎర్త్(హెచ్ఓ, వైటీ, డీవై) డాపింగ్ ఆన్ స్ట్రక్చరల్, ఆప్టికల్, మ్యాగ్నిటిక్ అండ్ ఎలక్ట్రికల్ ప్రాపర్టీస్ ఆన్ కోబాల్ట్ ఫెర్రియట్స్‌కు గాను డాక్టరేట్‌ను అందుకుంది. కాగా కళాశాలకు చెందిన అధ్యాపకురాలు డాక్టరేట్ అందుకోవడం పట్ల శనివారం కళాశాల ఆవరణలో శారదను ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓజా, అధ్యాపకులు సన్మానించారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 24: పీఆర్‌టీయూ(టీఎస్) రామగుండం మండల నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. శనివారం గోదావరిఖని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ రామగుండం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు కర్రు సురేష్, ప్రధాన కార్యదర్శి గండు కృష్ణమూర్తి హాజరై మాట్లాడారు. అనంతరం కమిటీని ప్రకటించారు. మండల నూతన అధ్యక్షులుగా తాండ్ర ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పర్లపెల్లి ర ఘుబాబు ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా సంపత్‌రావు, మహిళా ఉపాధ్యక్షురాలిగా వేల్పుల సంగీత, ఉపాధ్యక్షులుగా గోపికృష్ణ, మహిళా కార్యదర్శిగా నిఖత్‌ఫాతిమా, కార్యదర్శిగా సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం రామగుండం మండలంలో విద్యాసేవలు అందించి ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు, బదిలీపై ఇతర మండలాలకు వెళ్ళిన ఉపాధ్యాయులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీధర్‌రావు, వెంకటలక్ష్మి, ఆకుల రాజన్న, సతీష్‌బాబు, దాసరి రఘు, రామన్న, రవీందర్, రమేష్ పాల్గొన్నారు.



పోరాటాల ద్వారానే హక్కుల సాధన..

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 24: సింగరేణి కార్మికులు పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకునే అవకాశం ఉన్నదని సీఐటీయూ నాయకుడు ఉల్లి మొగిలి పేర్కొన్నారు. శనివారం ఆర్జీ-2 ఏరియా వర్క్‌షాప్‌లో జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 28న అన్ని జీఎం ఆఫీస్‌ల ఎదుట ధర్నాలు చేయనున్నామన్నారు. ఈ గేట్ మీటింగ్‌లో ఆర్జీ-2 కార్యదర్శి కుంట ప్రవీణ్, ఎస్ వెంకన్న, వినేష్, ప్రసాద్, శ్రావణ్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

లాభాల వాటా సమస్యను పరిష్కరించాలి

రామగిరి, ఆగస్టు 24: సింగరేణిలో లాభాల వాటాతో పాటు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఎల్‌పీ గని మేనేజర్‌కు శనివారం సీఐటీయూ నాయకులు అందజేశారు. అందులో ప్రధానంగా సింగరేణి దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న 35శాతం లాభాల వాటా, సొంత ఇంటి కల, పెర్క్స్‌పై ఇన్‌కం టాక్స్ సమస్యలను పరిష్కరించాలని కార్మికులతో సంతకాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి దొమ్మటి కొమురయ్య, నాయకులు దేవర రవికుమార్, దుర్గాప్రసాద్, తిరుపతి, సురేందర్, మనోహర్, పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

'మాన్యువల్ బీపీ పరికరాలు ఏర్పాటు చేయాలి'

శ్రీరాంపూర్, ఆగస్టు 24: సింగరేణి ఆస్పత్రులు, డిస్పెన్సరీలలో మాన్యువల్ బీపీ పరికరాలు ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2020 సంవత్సరం నుంచి బీపీపరీక్షించడానికి డిజిటల్‌బీపీ పరికరాన్ని వినియోగించడం వల్ల ఖచ్చితమైన సమాచారం రావడం లేదన్నారు. అందుకే మాన్యువల్ బీపీ పరికరాలు అందించాలని వారు కోరారు.

ఏఐటీయూసీ, సీపీఐపై ఆరోపణలు సరికాదు

కేంద్ర కార్యదర్శులు స్వామి, పోషం

గోదావరిఖని, ఆగస్టు 24: ఏఐటీయూసీని, సీపీఐని కొంతమంది కావాలనే బదనాం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శులు కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం ఆరోపించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లోజరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆగస్టు 14న బస్టాండ్ కాలనీలో జరిగిన సంఘటన యాదృచ్ఛికమని, అర్ధరాత్రి అక్కడికి స్వప్న వెళ్లడం, అక్కడ కొంతమంది దాడికి దిగారని, ఇది ఎవరైనా ఖండించవల్సిందేనని, ఏఐటీయూసీలో గూండాలు ఉన్నారని, సీఐటీయూలో రౌడీలు ఉన్నారని కొంత మంది మాట్లాడుతున్నారని, ఈ రెండింటికి ఏఐటీయూసీ దూరమన్నారు. రౌడీలను, గూండాలను ఎదురించింది ఏఐటీయూసీ, సీపీఐయేనని, దళితులకు ఆలయ ప్రవేశంతో పాటు దళిత హక్కుల కోసం పోరాటం చేసింది ఏఐటీయూసీ, సీపీఐయేనన్నారు. దళిత కార్మికురాలు స్వప్నపై దాడి పోలీస్ స్టేషన్‌లో విచారణలో ఉందని, ఈ దాడి వ్యక్తిగతమని, దీనిని ఏఐటీయూసీ, సీపీఐపై రుద్దడం సరైంది కాదన్నారు. కొంతమంది అంబేద్కర్ సంఘం నాయకులు, ఇతరులు కూడా హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లారని, తమ పార్టీ కూడా విచారణ చేస్తుందని, ఈ దాడి ఓ కుటుంబం కోసం జరిగిందని, ఆ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడుతామంటూ బెదిరిస్తే వారిని కౌన్సెలింగ్ చేయడానికి మడ్డి ఎల్లయ్య తీసుకువచ్చారని, ఆ సందర్భంలో దాడి జరిగిందన్నారు. దీనికి పార్టీకి ఏ సంబంధం లేదన్నారు. కానీ కొంతమంది పనిగట్టుకుని ఏఐటీయూసీ, సీపీఐని విమర్శిస్తున్నారని, దీనిని విరమించుకోవాలని, ఎవరైనా పార్టీని అబాసుపాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఏఐటీయూసీ నాయకులు రంగు శ్రీనివాస్, సంకె అశోక్, ప్రభుదాస్, పర్లపల్లి రామస్వామి, మానాల శ్రీనివాస్, రాజబాబు, శంకర్, నాగేందర్, సంపత్, కనకయ్య, భాస్కర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 24: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ సిఫార్స్ చేసిన వేతనాలను ఇవ్వాలని కోరుతూ శనివారం ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు కే విశ్వనాథ్ ఆర్జీ-2 యాజమాన్యాన్ని కోరారు. ఈమేరకు ఏరియా అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2015లో రెండు సార్లు సమ్మె చేసినట్టు తెలిపారు. హైపవర్ కమిటీ సూచించిన వేతనాలను సైతం అమలు చేయకపోవడంతో శ్రమకు దగిన వేతనాలు అందడం లేదని అన్నారు. సింగరేణి ఉత్పత్తి, ఉత్పాదకతలో కాంట్రాక్టు కార్మికుల పాత్ర కీలకంగా ఉన్నదని పేర్కొన్నారు. హైపవర్ వేతనాలను అమలు చేసి, ఆగస్టు నెల వేతనాలతో కలిపి పెరిగిన వేతనాలు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ నాయకులు లచ్చయ్య, రాంచందర్, ముత్తయ్య, రత్నకుమార్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఇఫ్టూ నాయకులు